# మున్నా

నేను అమెరికాలో స్థిరపడిన తెలుగువాణ్ణి. పాతికేళ్ళ వయసులో అమెరికా చేరిన నా వయసిప్పుడు నలభై రెండు. నాకక్కడ స్వంత ఫ్లాటుంది. కేవలం రొక్కమే బ్యాంకులో అయిదు లక్షల డాలర్లుంటుంది.

కూడబెట్టాలనుకుంటే నా దగ్గర ఇంకా డబ్బుండేది. కానీ నాకు మాతృదేశమన్నా, అయినవాళ్ళన్నా అంతులేని ప్రేమ. అందుకని తరచుగా ఇండియా వెళ్లడం, అయినవాళ్ళ నాదుకోవడం చేసేవాణ్ణి.

ఈ సారి మాత్రం ఎందుకో ఐదేళ్ళయిపోయింది. అందుకు రక రకాల కారణాలు చెప్పవచ్చు. ఇటీవల తెలుగు సినిమాలు వీడియోలుగా, ఆడియోలుగా అమెరికాలో కూడా విరివిగా లభిస్తున్నాయి. సెమినార్లనో, బిజినెస్ టూర్లనో, చదువనో అమెరికాకు వచ్చిపోయే తెలుగు వారి సంఖ్య బాగా పెరిగింది. వారి ద్వారా ఇండియాలో అయిన వాళ్ళింటి విశేషాలు వీడియోల రూపంలో నాకందుతున్నాయి. తెలుగునాట వీడియోల ప్రాబల్యం బాగా పెరగడం నాకిలా లాభించింది.

ఇవన్నీకాక సరిగ్గా నాలుగేళ్ళ క్రితం నేనుద్యోగంలోంచి వ్యాపారంలోకి మారాను. ఒక ఏడాది చాలా తికమకపడి రెండేళ్ళలో నిలదొక్కుకున్నాను. కానీ ఊపిరి సలపని పని.

ఏమైతేనేం మళ్ళీ ఇండియా వచ్చాను. సకుటుంబంగా ఇంట్లో పది రోజులున్నాక నా గాలి పల్లెటూరి మీదకు మళ్ళింది.

అప్పుడే పుట్టిన పాపకు అమ్మే ప్రపంచం. అమ్మ ఒడిలోంచి బయటపడి పరిసరాలనర్థం చేసుకునేపాటి అవగాహన ఏర్పడిన చిన్నతనంలో నాకు నా పల్లెటూరే ప్రపంచంలా ఉండేది. ఈ ప్రపంచమొక అద్భుతంలా తోచే ఆ పసి వయసులో నా పల్లెటూరి ప్రకృతి, మనుషులు తొలి పరిచయాలు.

కొందరు నన్ను పాడమనేవారు. కొందరు నన్ను నృత్యం చేయమనేవారు. నా వయసు వాళ్ళతో ఆటలు. అక్కడ అందరూ నాకు మంచి మిత్రులే! నేనేం చేసినా సంతోషించేవారే!

పల్లెటూరు గుర్తుకొస్తే అన్నీ తీయని అనుభవాలే!

అలాంటి తీయని అనుభవాల పుట్ట అయిన నా పల్లెటూరు నా భార్యాబిడ్డలకు బురద, ధూళితో నిండిన అశుభ్ర, అసభ్య, అనాగరిక ప్రాంతంలా తోస్తుంది. వాళ్ళక్కడికి రామంటారు. నా భార్యను నేను మందలిస్తే ఆమె చలించక "పల్లెటూరు మాకు నచ్చదు. మేము ఊరును చూస్తే మీరు పాత జ్ఞాపకాలు చూస్తారు. అలాంటి పాత జ్ఞాపకాలు మాకూ ఉంటే పల్లెటూరు మాకూ నచ్చేదేమో!" అందోసారి. ఆ మాటల్లో నిజం లేకపోలేదు.

అందుకే ఈసారికూడా వాళ్ళు రామని అంటే బలవంతపెట్టలేదు నేను. నేనే బయల్దేరాను ఒంటరిగా.

పల్లెటూళ్ళో బాబాయి ఉంటున్నాడు. ఆయనక్కడ వ్యవసాయంలో స్థిరపడ్డాడు.

అమ్మ నన్ను కార్లో వెళ్ళమంది. అలా వెడితే నేను అమెరికా వాణ్ణి తప్ప మా ఊరివాణ్ణి కాలేను. బస్సులో వెళితే చిన్నప్పట్నించీ నాకు పరిచితులైన వ్యక్తులు కనపడకపోయినా వారి వ్యక్తిత్వాలను చూడగలను.

నేను బస్సులోనే బయల్దేరాను. బస్సు మా ఊళ్ళోకి వెళ్ళదు. దిగాక అడ్డదారిలో రెండు కిలోమీటర్లు నడవాలి. ఆ దారి కటూ ఇటూ సీమచింత చెట్లుంటాయి. ఆ కాయలు కోసుకుని అందులోని ఎర్రటి గుజ్జును తినడం ఇప్పటికీ నా కిష్టమే! ఆ అనుభవం నాకు మిగల్చాలనేమో ఇప్పటికీ మా ఊరలాగే ఉంది.

మార్పు లేని పల్లెటూళ్ళు ప్రగతి నిరోధకాలని చాలా మంది అనుకోవచ్చు. కానీ వాతావరణ శాస్త్రజ్ఞులకవే ఆదర్శాలు!

దారిలో కొందరు నన్ను చూడగానే గుర్తుపట్టి చనువుగా విశేషాలడిగారు. కొందరు మొహమాటంతో పక్కకు తప్పుకున్నారు. వాళ్లందరి ప్రవర్తనలూ విభిన్నంగా ఉన్నా అవన్నీ కలిసి ఊరు నా కిస్తున్న స్వాగతంలా అనిపించింది.

నేనిల్లు చేరేసరికి ఇంట్లో పిన్ని మాత్రముంది. బాబాయి పొలం వెళ్ళాట్ట. పిన్ని కొడుక్కి ఇటీవలే ఉద్యోగం వచ్చి బొంబాయి వెళ్ళిపోయాడు.

నన్ను చూడగానే పిన్ని ముఖం ఇంతయింది. ఆప్యాయంగా పలకరించి ఎన్నో కబుర్లు చెప్పింది. నేను నాకు తెలిసిన వాళ్ళందరి గురించీ వాకబు చేశాను. అయిదేళ్ళలో పరిస్థితులు బాగా మారాయి. అప్పుడంతా ఖాళీగా ఉండేవారు. ఇప్పుడందరూ బిజీగా అయిపోయారు. కొందరు కాసెట్ల రికార్డింగు, కొందరు వీడియో లైబ్రరీలు, కొందరు కంప్యూటర్లు, కొందరు చేతి పనుల శిక్షణా కేంద్రాలు... ఇలా చుట్టుపక్కల టౌన్సులో స్వయం ఉపాధి చూసుకుంటున్నారు. ఊళ్ళో కూడా కొంత హడావుడి ఉంది. కాసేపట్లో పిన్ని కూడా ఊళ్ళో కొత్తగా ఆర్నెల్ల క్రితం ప్రారంభమైన చేతిపనుల శిక్షణా కేంద్రానికి వెడుతుంది. ప్లాస్టిక్ దారాలతో రకరకాల వస్తువులు చేయడం నేర్పుతారక్కడ.

"ఇలా అయితే ఇక్కడ కూడా బేబీ సిట్టర్ల అవసరం పడుతుంది?" అన్నాను నవ్వుతూ. అమెరికాలో ఇంట్లో అందరికీ తలో పనీ ఉండడం వల్ల చంటి పిల్లల్నీ, చిన్న పిల్లల్నీ చూసే పనికి జీతం మీద వృద్ధుల్ని నియమిస్తారు. వాళ్ళను బేబీ సిట్టర్లంటారు.

"ఇంకా ఇక్కడ కూడా అవసరమంటావేమిటి? పక్కింట్లో బేబీ సిట్టరు ఉండనే ఉంది. ఆ బేబీ సిట్టరు ఊరికే పెద్ద ఆకర్షణ. ఓసారి వెళ్ళి చూసిరా" అంది పిన్ని.

పక్కిల్లు మాదే! ఓ నవ దంపతులకది అద్దెకిచ్చిన గుర్తు. పిన్నినడిగితే వివరాలు చెప్పకుండా "వెళ్ళి చూసిరా" అంది.

వెళ్లాను.

తలుపులు దగ్గరగా వేసి ఉంటే తోశాను.

"ఎవరది?" అన్న చిన్న పాప గొంతు వినిపించింది. ఎవరది అని ఆ పాప స్పష్టంగానే అన్నా అది 'ఎవయది' అని ముద్దుగా ధ్వనించింది.

ఆ వెంటనే నాకా పాప కూడా కనిపించింది. నిండా మూడేళ్ళుండవు. తెల్లగా మిసమిసలాడిపోతూ బొద్దుగా, ముద్దుగా ఉంది. చిన్న పిలక జడ, ముఖంలోని ప్రత్యేకత చూడగానే ఆడపిల్ల అని తెలుసున్నది. వంటి మీద చిన్న చెడ్డీ మాత్రమే ఉండటం వల్ల ఆ పాప ఇంకా చాలా ముద్దొస్తోంది. ఇలాంటి డ్రస్సులో వయసొచ్చిన పిల్లను మించిన ఆకర్షణ వయసులేని పిల్లలకే ఉంటుంది.

ఆ పాప నన్ను చూస్తూనే చకచకా పక్కనే ఉన్న బుల్లి గౌనొకటి వేసుకుని, "అమ్మ చెప్పింది. మగాళ్ళు కనపడితే గౌనేసుకోవాలని!" అంది.

నాకు చాలా ముచ్చటేసి, "అది పెద్దవాళ్ళకు - నువ్వు బాగా చిన్న పిల్లవు. గౌను లేకుండానే బాగున్నావు" అన్నాను.

"ఇంకో నెల్నాళ్ళలో నాకు మూడేళ్ళు నిండుతాయి. నేనేం చిన్న పిల్లను కాను. నా గౌను మీకు నచ్చలేదా!" అంది పాప.

"గౌను చాలా బాగుంది" అన్నాను వెంటనే.

"ఇది అమ్మ కుట్టింది. అందుకే బాగుంటుంది" అని, "అమ్మో! అడగటం మర్చిపోయాను. మీకు మంచి నీళ్ళు కావాలా?" అంది పాప.

ఏం చేస్తుందో చూడాలని దాహంగా లేకపోయినా మంచినీళ్ళిమ్మన్నాను. అయిదు నిముషాల్లో వయ్యారంగా నడుచుకుంటూ ఓ గ్లాసుతో నీళ్ళు తెచ్చింది పాప. ఆ దృశ్యం చూడాలే తప్ప మాటల్లో వర్ణించలేనంత మనోహరంగా ఉంది.

మంచినీళ్ళు తాగి, "అమ్మ లేదా ఇంట్లో" అన్నాను.

"అమ్మ బడికెళ్ళింది. సాయంత్రం వస్తుంది" అని, 'అయ్యో! మీరింకా కూర్చోలేదు!' అంది పాప.

నేను కూర్చుని "నీ పేరు!" అన్నాను.

“మృణాళిని. అంతా మున్నూ అంటారు. నాకు అన్ని పనులూ వచ్చు. పాటలు, డాన్సు కూడా వచ్చు” అందా పాప.

ఊరికే ఆకర్షణ అయిన బేబీ సిట్టరు కోసం నా కళ్ళు వెతుకుతున్నాయి.

“ఏదీ డాన్సు చేయి!” అన్నాను పాపతో.

మున్నూ డాన్సు చేసింది. చక్కగా చేతులు, ముచ్చటగా కళ్ళు తిప్పుకుంటూ, మధ్య మధ్య పైకెగురుతూ భలేగా డాన్సులు చేసింది. కూడా వీడియో కెమేరా ఉండటం నా అదృష్టం. పాప చేష్టలన్నీ అందులో బంధించేశాను. నేను ఫొటో తీస్తున్నాని తెలిసి మున్నూ మరింత విజృంభించి, తనకు తెలిసిన కథలు చెప్పింది. పాటలు పాడింది. నాకు విసుగనిపించలేదు సరికదా కాలం తెలియలేదు.

మధ్యలో ఏదో ప్రసక్తి రాగా, “మీ నాన్నగారేరీ!” అనడిగాను.

మున్నూ కళ్ళల్లో నీళ్లు!

“నాన్న పోయాడుగా. అందుకే అమ్మ ఉద్యోగం చేస్తోంది. నేనేమో... ”తర్వాత దానికి మాట రాలేదు.

నేను మున్నూని దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టుకుని, “మున్నూ చిన్న పిల్ల కాదుగా, అందుకని ఏడవదు...” అని ఓదార్చి మాట మార్చడానికి, “ఇంట్లో ఇంకెవరూ లేరా?” అనడిగాను. ఇంతసేపై నేను, బేబీ ఇంట్లో ఉంటే పట్టించుకోకుండా ఆ బేబీ సిటరేం చేస్తున్నట్లో నాకు తెలియలేదు. అదీకాక ఆ బేబీ సిట్టర్లోని ఆకర్షణేమిటో తెలుసుకోవాలని కూడా ఉంది.

“లేకేం, రండి...చూపిస్తాను.” అంది పాప. నేను కుతూహలంగా పాపను అనుసరించాను. ఇద్దరం పక్క గదిలోకి వెళ్ళాం. అక్కడ దృశ్యం నన్నాశ్చర్యచకితుణ్ణి చేసింది.

మంచం మీద పరిచిన మెత్తటి బొంతలో ఆదమరిచి నిద్రపోతున్నాడో బాబు!

“ఈ బేబీకి నేను సిస్టర్ని!” అంది మున్నూ. అది సిస్టరని స్పష్టంగా అన్నా ‘సిట్టర్’ అన్నట్లే ఉంది.

నిండా మూడేళ్లు లేని పాప ఇంట్లో తల్లి లేకుండా ఒక్కర్తే ఉండగలగడమే కాక తనే బేబీ సిట్టరుగా వ్యవహరించడం అపూర్వం. ఎడాప్టేషనంటే ఇదేనేమో మరి!

అప్పుడే బాబు ఉలిక్కిపడి లేచి కుయ్యోమన్నాడు. పాప వాడికి పాలు పట్టి నిద్రపుచ్చింది. అపురూపమైన అలాంటి దృశ్యం నాకే సినిమాలో దొరుకుతుంది?

నేను ఇంటికి తిరిగి వెళ్ళేక వీడియోలోని విశేషం చూసి నా భార్యాబిడ్డలు మున్నూ కోసం పల్లెటూరు వస్తామన్నారు.

‘బేబీ సిట్టరు ఊరికే కాదు, టూరిస్ట్ అట్రాక్షన్‌గా కూడా మారిందన్నమాట!’ అనుకున్నాను. ★

*(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక - 29-11-90)*